# లోక విద్య ప్రపంచం

పక్షపత్రిక

లోకవిద్యాధరుల గొంతు

సంపుటి-1, సంచిక-1 16-ఆగస్టు - 2013 సంపాదకుడు & ప్రచురణ కర్త : టి. నారాయణ రావు వెల. రూ. 2


## దేశంలో రాయితీలు ఎవరికి చేరుతున్నాయి!

మన కుటుంబాలలో అత్యంత బలహీనుడికి బలవర్ధక ఆహారం పెట్టడం, తక్కువ తెలివితేటలు లేదా ఆస్తి పాస్తులు లేని వాడికి ఆస్తిలో పెద్ద వాటా ఇవ్వడం సహజంగా జరుగుతుంది. దీన్ని ఎవరు తప్పుపట్టరు. ఎందుకంటే కుటుంబంలో అందరూ ఆనందంగా ఉండటానికి. కానీ ఇదే రాయితీ ప్రభుత్వం ఇస్తుంటే 60 సం॥ల తర్వాత కూడా ఎందుకీ రాయితీలు అనే చర్చ కొంతమంది మేధావులు ముందుకు తెస్తున్నారు.

ఎక్కడైనా ప్రజా ప్రభుత్వంలో పెద్దగా హెచ్చుతగ్గులులేని సమాజంలో అందరికి విద్య, వైద్యం, తిండి, బట్ట, ఇల్లుతో పాటు కొంత ఇతర సౌకర్యాలు కోరుకోవడం, సమకూర్చడం సహజం. కానీ ఈ రోజు కొద్దిమందికి మాత్రం వారి పెద్దలు సంపాదించిన ఆస్తి, అధికారం, పలుకుబడితో పుట్టుకతోటే అంతులేని సౌకర్యాలు కలగడం సమాజంలో ఉద్రిక్తలకు దారితీస్తోంది. దీన్ని తగ్గించడానికే వివిధ రకాల మేధావులు సామాజిక న్యాయం సూత్రాన్ని ముందుకు తెచ్చారు.

పుట్టుకతోటే తారతమ్యాల వల్ల అత్యధిక జనాభా తీరని కోరికలతో జీవితం గడపాల్సిరావడం అసూయ-విద్వేషాలకు దారితీస్తుంది. సమాజానికే ప్రమాదకరం. కనుక సామాజిక న్యాయం అంటే సుమారుగా అందరికి సమాన అవకాశాలు కల్పించడానికే రాయితీలు ఇవ్వబడుతున్నాయి. ఆ రాయితీలే రిజర్వేషన్లు, స్కాలర్ షిప్పులు, రేషన్‌కార్డులు, గ్యాస్ సబ్సిడీలు, వివిధ వర్గాలకి ప్రయాణాలలో రాయితీలు మరియు ఇతర ప్రభుత్వ రాయితీలు మొదలైనవి. ఇప్పుడీ రాయితీలు ఎవర్కి చెందుతున్నాయో గమనిద్దాం. పన్నుల రూపేణా భారతదేశ ప్రభుత్వం ప్రతి సం॥ సేకరించే సుమారు 11 లక్షల కోట్ల రూపాయాల్లో భారత ప్రజలలో దారిద్ర్య రేఖకు దిగువన వున్నవారి కోసం ఇచ్చే సబ్సిడీలన్నీ కలిపి సుమారు లక్ష కోట్లు మాత్రమే. అదే సమయంలో 5 లక్షల 73 వేల కోట్లు (2012-13) కొత్తగా పరిశ్రమలు పెట్టడానికి, ఎగుమతి, దిగుమతి రాయితీలకు ఇవ్వడం జరుగుతోంది. భారతదేశంలోని రైతులకు రకరకాల రుణాల రద్దు కింద సుమారు 50 వేల కోట్ల రూపాయలు ప్రభుత్వం ఖర్చుపెడితే 10 లక్షల కోట్లు ప్రచారానికీ, ప్రకటనలకు ఖర్చయిందంటే అతిశయోక్తికాదు.

బడా కంపెనీలకిచ్చిన రాయితీల వివరాలు ఈ క్రింది విధంగా ఉన్నాయి.

| | కార్పొరేట్ ఆదాయంపై పన్ను | ఎక్సైజ్ సుకంపై రాయితీ | దిగుమతి సుకంపై రాయితీ | మూడు రాయితీలు మొత్తం |
|---|---|---|---|---|
| 2004-05 | 57852 | 30449 | 92561 | 1,80,862 |
| 2005-06 | 34618 | 66,760 | 127730 | 229,108 |
| 2006-07 | 50075 | 99,690 | 123682 | 273447 |
| 2007-08 | 62199 | 87468 | 153593 | 303260 |
| 2008-09 | 66901 | 128293 | 225752 | 420946 |
| 2009-10 | 72881 | 169,121 | 195288 | 437290 |
| 2010-11 | 88263 | 198291 | 201166 | 487720 |
| 2011-12 | 79173 | 212167 | 223653 | 514993 |
| 8సం॥ల మొత్తం | 5,11,962 | 9,92,239 | 13,43,425 | 28,47,626 |

ఈ 3 రాయితీలు కలిసి 2004-05 లో 180862 కోట్ల రూపాయలు 2011-12 సం॥లో 5 లక్షల కోట్లు దాటిపోయాయి. సామాన్య జనానికిచ్చే రాయితీలు ఏటేటా కోతలు విధిస్తున్నారు. ఈ 3 పద్దులకింద ఇచ్చిన రాయితీలు కేంద్ర ప్రభుత్వ పన్ను ఆదాయంతో పోటీపడుతున్నాయి.

కేంద్ర ప్రభుత్వ పన్ను ఆదాయంతో 3 రాయితీల నిష్పత్తి

| | కేంద్రప్రభుత్వ పన్ను ఆదాయం | పై 3పద్దుల రాయితీ | నిష్పత్తి శాతం |
|---|---|---|---|
| 2004-05 | 224857 | 180862 | 80.43% |
| 2005-06 | 270264 | 229108 | 84.77% |
| 2006-07 | 351182 | 273447 | 77.87% |
| 2007-08 | 439547 | 303260 | 68.99% |
| 2008-09 | 443319 | 420946 | 94.95% |
| 2009-10 | 474218 | 437290 | 92.22% |
| 2010-11 | 534094 | 487720 | 91.32% |
| 2011-12 | 664457 | 514993 | 77.51% |
| 8 సం॥ మొత్తం | 34,01,938 | 28,47,626 | 83.71% |

(బడ్జెట్ పత్రాల ఆధారంగా)

పై సంఖ్యలు చూస్తేనే ఏ వర్గాలకోసం ప్రభుత్వం ప్రజలవద్ద నుంచి పన్నులు వసూలుచేస్తోందో తెలుస్తోంది.

ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడిదారీ ఆర్థిక విధానాలకు కుదేలైన 2008-09 సం॥లో మనదేశంలోని పారిశ్రామిక వేత్తలకు, బడా వ్యాపారస్తులను సంక్షోభం నుండి బయటపడేయడానికి ఒక్క బంగారు, వజ్రాల ఆభరణాల రంగానికి సుమారుగా 25 వేల కోట్ల రూపాయలు రాయితీ ఇచ్చారు. అయినా లక్షలాది కార్మికులు ఉపాధి పోగొట్టుకొని అల్లాడిపోయారు. దాదాపు 100 మంది వరకు వజ్రాభరణాల పరిశ్రమలలోని పనిచేసే కార్మికులు ఆత్మహత్యలు చేసుకున్నారు. ప్రజల పొట్టగొట్టి కార్పొరేషన్ల ప్రయోజనాలకై పనిచేసే భారతప్రభుత్వ విధానాలే ప్రజలకు పట్టిన అసలు జబ్బు.

మనకందరికి తెలిసిన 2జి కుంభకోణం, బొగ్గు కుంభకోణం మొదలైన వాటిపై ప్రభుత్వం నష్టపోయింది, కనీసం 6 లక్షల 25 వేల కోట్లని కాగ్ నిగ్గు తేల్చింది. భారతదేశంలోని అన్ని రాష్ట్రాల బడ్జెట్‌లు కలిపి సుమారు 30 లక్షల కోట్లు, గత 7 సం॥లలో పెద్ద కంపెనీలకు ఇచ్చిన రాయితీలు 31 లక్షల కోట్లు అంటే నిమిషానికి 75 లక్షల రూపాయల రాయితీలు అంబానీలు, బిర్లాలు, టాటాలు మొదలైనవారు పోయిన 7 సం॥రాలుగా సంపాదిస్తున్నారన్నమాట. దీనిపై ఎవరూ చర్చించడం లేదు.

మనదేశంలో సుమారు సగం మంది ప్రజలు యువకులు వీరిలో అత్యధిక శాతం తరతరాల "లోకవిద్యావృత్తులలో నిపుణులైనా, వారి సరుకులకు గిట్టుబాటు ధర దొరక్క, జీవించటమే కష్టంగా మారింది. ఈ యువత అంతా లోకవిద్య ద్వారా స్థానిక వనరులతో ఉత్పత్తి చేసే వస్తువులను వారికి సరియైన గిట్టుబాటుధర చెల్లించి ప్రభుత్వం సేకరిస్తే వినియోగదారులకి తక్కువ ధరకు అమ్మి, ఆ వస్తు వినియోగం పెంచగలిగితే దానికి కావల్సిన పెట్టుబడికి, 3శాతం తక్కువ వడ్డీకి బ్యాంకు రుణాలు, చేతివృత్తుల వారికి వ్యవసాయదారులకి, కుటీర పరిశ్రమల వారికి ఇవ్వడం జరిగితే గ్రామీణ ప్రాంతంలో కొనుగోలు శక్తి పెరిగి పట్టణాలకు వలసలు ఆగుతాయి. అంతేకాని పెద్ద పెట్టుబడిదారులకిచ్చే రాయితీలతో ప్రపంచంలోని అత్యంత ధనికుల్ని భారత్ తయారు చేయ్యడాన్కి మాత్రం ఉపయోగపడ్తుంది. భారత సమాజంలో అసూయా ద్వేషాలు పెరగడానికి దారితీస్తుంది.

ఇలా కాకుండా పన్నుల రూపేణా వసూలు చేసిన మొత్తం ఉన్నత వర్గాల వారికి రాయితీల రూపేణా దోచిపెట్టే విధానం, మార్చి ప్రత్యామ్నాయంగా లోకవిద్యాధర సమాజీయులందరికి గౌరవ ప్రదంగా జీవించే హక్కు కల్పించటానికి ఉపయోగించాలి. చేతి వృత్తులు, కుటీర పరిశ్రమలుల్లో తయారైన వస్తువులకు, వ్యవసాయోత్పత్తులు, పండ్లు, ఫలాలకు మంచిధర చెల్లించి గ్రామీణ ప్రాంతానికి సబ్సిడీలు అంటే రాయితీలు అందచేయాలి. సామాజిక భద్రతతోపాటు ఉద్రిక్తలు లేని పట్టణ ప్రాంతాలు కావాలనే వారంతా రాయితీలు పరిశ్రమలుకివ్వటాన్ని వ్యతిరేకించాలి, వారి ప్రతినిధులని వచ్చే ఎన్నికలలో ఓడించాలి. కార్పోరేట్ రాయితీలకు వ్యతిరేకంగా ఉద్యమించి కార్పొరేట్ సంస్థల ఆస్తుల జాతీయానికి సిద్ధంకావాలి.

లోకవిద్యాధరుల సమాజ శ్రేయస్సు కోరే వారికే కుల, మత ప్రాంతాలతోనూ, చదువు సంధ్యలతోనూ నిమిత్తం లేకుండా శాసనసభలకు ఎన్నుకోవాలి. అప్పుడే భారతదేశంలోని ప్రస్తుత ఉద్రిక్త పరిస్థితులస్థానే ప్రేమాభిమానాలు పరిఢవిల్లుతాయి.

**విద్య అంటే సమాజంలో అసమానతలను తొలగించేది.**

## ప్రత్యామ్నాయ అభివృద్ధికోసం లోకవిద్య జ్ఞాన రాజకీయాలు

మనదేశంలో 60ఏళ్ళుగా ఎన్నికలు వచ్చేనరికి; ఉద్వేగాలు, ఉద్రేకాలు రెచ్చగొట్టడానికి ప్రాంతాభివృద్ధి, కులాభివృద్ధి, మతాభివృద్ధి భాషాభివృద్ధి, పరిశ్రమల స్థాపన, భూపంపిణీ, నీటిపారుదల, ఆత్మగౌరవం, వికేంద్రీకరణ తదితర పేర్లతో జరిగాయి. చివరిగా 60 ఏళ్ళ తర్వాత చూస్తే ఎన్నికయిన ప్రతీ ప్రభుత్వం కూడా మనకు సాధించిందేమిటి?

స్థానికంగా ఉన్నటువంటి వాతావరణం, సహజవనరులు, ప్రజలలో జ్ఞానం, నైపుణ్యంతో స్థానికంగా సర్వస్వతంత్రంగా బతకొచ్చుననే గాంధీ మహాత్ముడి ఆలోచస్థానే, అభివృద్ధి పేరుతో జనాల్ని తమ ప్రాంతం నుండి కాందిశీకులుగా మార్చి, పరిశ్రమల స్థాపన, పెద్ద ప్రాజెక్టులు, అడవులనాక్రమించి గిరిజనులను ఆప్రాంతంనుండి నాగరిక సమాజం పేరుతో తమ ఆవాసాల నుండి తరిమేయడం; పెద్దఎత్తున ఉత్పత్తి పేరుతో చిన్న, కుటీర పరిశ్రమలను మూయించివేయడం; చివరికి గ్రామంలో తెల్లవారిన వెంటనే కావల్సిన ప్రతీదానికి పాలు, నీరు, పప్పులు, బియ్యంతోసహా పట్టణాలపై ఆధారపడాల్సిన దిగుమతులపై ఆధారపడాల్సిన స్థితికి నెట్టివేయబడ్డాం. దీన్నే అభివృద్ధి అని, దీనిని మరింత వేగంగా అమలు జరుపుతామని పోటీపడేవారు ఈ రోజు రాజకీయాలు చేస్తున్నారు. ఎన్నికల్లో కోట్లు పెట్టుబడి పెడుతున్నారు. ఎన్నికలకు ఎన్నికలకు మధ్య వందల, వేల, లక్షల, కోట్ల రూపాయలు పోగేసుకుని ప్రచారసాధనాల ద్వారా విచ్చల విడి ఖర్చు ద్వారా చివరి నిమిషంలో ఉద్వేగ ప్రసంగాల ద్వారా విద్వేషాలను రెచ్చగొడుతూ పదేపదే ఎన్నికవుతున్నారు.

ప్రతీ ప్రాంతంలోనూ సుఖజీవనానికి, స్థానిక వనరులతో ప్రజలందరికి పర్యావరణాన్ని రక్షించుకుంటూ కాందిశీకులుగా లేని నూతన సమాజ నిర్మాణానికి, రైతులకు భూమిని, చిన్న వ్యాపారస్తులకు తమ వ్యాపారాన్ని, చేతివృత్తుల వారికి వారి జ్ఞానాన్ని, గిరిజనులకు వారి ఆవాసాల నుండి తరమకుండా నూతన అభివృద్ధి నమూనాన్ని ఆవిష్కరించేదే లోకజ్ఞానం. రాజకీయాల్లో, ఎన్నికల్లో ఈ జ్ఞానం యొక్క విలువ ఈనాడు అవసరం వుందని లోకజనాందోళన మధ్యప్రదేశ్ ఎన్నికల్లో విస్తృతంగా ప్రచారం చేస్తూ సభలు, సమావేశాలు పెట్టి దేశ రాజకీయాల్లో లోకవిద్యాధరుల కోసం ప్రత్యామ్నాయ అభివృద్ధి నమూనాను గురించి ప్రచారం చేస్తున్నారు.

**- మధ్యప్రదేశ్ సింగ్రౌలి లోకజనాందోళన ప్రతినిధి**

**జ్ఞానం ఏ ఒక్కరి సొత్తు కాదు. ఇతరులను దోచుకోవటానికి పనికొచ్చేది జ్ఞానం కాదు.**

# ప్రత్యామ్నాయ అభివృద్ధి నమూనాలో చిన్ననీటిపారుదల రంగంలో చెరువులపై కృషితోనే నవ సమాజ నిర్మాణం సాధ్యం

అభివృద్ధి పేరుతో, నిరంతర వ్యవసాయం కోసం భారీ ప్రాజెక్టుల పేరుతో ప్రకృతి వనరులను ధ్వంసం చేయడం, సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం ద్వారా వేల ఎకరాల భూములను ముంపుకు గురి చేయడం, ముంపు గ్రామాల ప్రజలకు పునరావాసం కల్పించడం గానీ, ప్రాజెక్టు కింద భూములు కేటాయించడంగాక నామ మాత్రపు రేటు పేరుతో నష్టపరిహారం చెల్లించి, నిర్బంధంగా ప్రజలను ఖాళీ చేయించడం జరుగుతోంది. కోర్టు వివాదాలు అంతిమంగా మధ్యదళారీలయిన లాయర్లు, మాఫియా బృందాలు లబ్ది పొందాయి తప్ప రైతులకు జరిగిందేమిలేదు. ఇచ్చిన పరిహారం కరిగిపోగా రైతులు కూలీలవుతున్నారు.

బ్రిటీష్ వారికాలంలో చేపట్టిన గోదావరినదిపై ధవళేశ్వరం, కృష్ణానదిపై కృష్ణా బ్యారేజి నిర్మాణాలు పెట్టిన పెట్టుబడిపై నికర ఆదాయం లభించే పథకాలనే చేపట్టడం జరిగింది. స్వాతంత్ర్యానంతరం అధికారంలోకి వచ్చిన పాలకులు ఇదే విధానాన్ని అనుసరించి వెనుకబడిన ప్రాంతాల్లో ప్రాజెక్టులు నిర్మించకుండా అభివృద్ధి చెందిన కోస్తా ప్రాంతాలకే నీటి వినియోగం కొరకు శ్రీశైలం, నాగార్జునసాగర్ వంటి భారీ ప్రాజెక్టులు నిర్మించారు. అయితే సకాలంలో నిధులు విడుదలచేయకపోవడం, ప్రాజెక్టు పూర్తయినా పంటకాలువలు నిర్మాణం, భూమి చదును చేయడంలో జాప్యం వలన ఎగువ ప్రాంతాలలో అధికనీటి వాడకం, కాల్వ చివరి భూములకు నీరందకపోవడం డ్రైనేజ్ కాల్వల నిర్మాణం చేయకపోవడంతో అనేక అసమానతలు ఏర్పడి, దీర్ఘకాలం నిర్మాణాలు కొనసాగడం (50 సం॥లపైగా) తో ప్రాంతాల మధ్య అసమానతలు తలెత్తాయి. వెనకబడిన ప్రాంతాలలో ప్రాజెక్టుల నిర్మాణం లాభసాటికాదని నిధులు కేటాయించని పాలకులు అభివృద్ధి చెందిన ప్రాంతాల్లో చేపట్టిన పథకాలకు నిధుల కేటాయింపు జాప్యం వలన అంచనాలు పెరిగి నష్టకరంగా తయారయ్యాయి. ఈ విధంగా భారీ, మధ్యతరహా ప్రాజెక్టుల నిర్మాణం పైన చూపిన శ్రద్ధ చిన్న నీటిపారుదల రంగంలో చెరువుల మరమ్మతులకు నిధులు కేటాయించలేదు. భారీ ప్రాజెక్టుల నిర్మాణంలో భాగంగా కొన్ని చెరువులకు నీటిని మళ్ళించారు తప్ప గ్రామాలలో వుండే చెరువుల నిర్వాహణ ఎడల పూర్తి నిర్లక్ష్యం వహించారు.

ఉదా : 1963లో ప్రారంభించిన శ్రీరామ్‌సాగర్ (పోచంపాడు) ప్రాజెక్టు 4 సం॥లలో 40 కోట్లతో పూర్తి చేస్తామని 16 లక్షల ఎకరాల నీరందిస్తామని చెప్పి ప్రాజెక్టు పూర్తిచేసి ప్రధాన కాలువలు, పంటకాలువలు నిర్మించకపోవడంవలన 50 సం॥ల తరువాత కూడా వేలకోట్ల రూ॥లు వ్యయం చేసినా 4లక్షల ఎకరాల ఆయకట్‌కు నీరందడంలేదు. అంతేగాక ప్రాజెక్టుకు పైభాగంలో క్యాచ్‌మెంట్ ఏరియాలో భూములసాగు, విచ్చలవిడి నిర్మాణాలు ఫలితంగా 100 సం॥లలో 30 టి.యం.సి.ల పూడిక వస్తుందని వేసిన అంచనా తిరగబడి 30 సం॥ల లోపునే ప్రాజెక్టులో పూడిక ఏర్పడి 30 టి.యం.సి,ల సామర్థ్యం కోల్పోయింది. ప్రపంచంలో ఏదేశంలో కూడా భారీ ప్రాజెక్టుల నిర్మాణంలో పూడిక వెలికితీత వ్యయభారం అని ప్రాజెక్టు నిర్మాణం కన్నా ఎక్కువ ఖర్చు అవుతుందని ఇంతవరకు ఎక్కడా చేపట్టడం జరగలేదు. భారీ ప్రాజెక్టుల ద్వారా కంట్రాక్టర్లు, సిమెంటు కంపెనీలు, భారీ యంత్రాల వినియోగం ద్వారా మార్కెట్ ప్రయోజనాలు కలగలిసి వున్నాయి. ఈ ప్రాజెక్టుల వలన ప్రజలకు కలిగే ప్రయోజనం కన్నా కంట్రాక్టర్లు, కంపెనీలకు ఒనగూరే ప్రయోజనాలే ప్రధానం.

అంతర్జాతీయంగా బహుళజాతి కంపెనీల కోసం మౌలిక సౌకర్యాల అభివృద్ధి పేరుతో భారీ ప్రాజెక్టులు, ఫ్లైఓవర్‌లు, ఆరు రహదారుల రోడ్లు, అంతర్జాతీయ విమానశ్రయాలు, పోర్టులు నిర్మించడం ద్వారా అంతర్జాతీయ మార్కెట్‌కు రవాణా సౌకర్యాలు కల్పించేందుకు మౌలిక సౌకర్యాల కల్పనలో వేలకోట్లు అప్పులు చేసి నిర్మిస్తున్నారు. సంస్కరణల అమలులో ఇ.పి.సి విధానం అమలుపేరుతో లక్ష కోట్ల రూ॥ వ్యయంగల సాగునీటి ప్రాజెక్టులు చేపట్టారు.

సంస్కరణల ముందు కాలంలో పరిశోధన, అంచనాలు, డిజైన్, నిర్మాణం పర్యవేక్షణ నీటిపారుదల శాఖ ఆధ్వర్యంలో జరిగేవి. ప్రాజెక్టు నిర్మాణం మాత్రమే టెండర్ ద్వారా జరిగేది. ఇ.పి.సి. అమలు తరువాత పరిశోధన, అంచనాలు, డిజైన్, నిర్మాణం అన్నీ పరిమితులు లేకుండా నవరత్న కంపెనీలు ఇష్టం వచ్చినట్లు అంచనాలు పెంచి, ప్రజాధనం కొల్లగొట్టారు. పబ్లిక్ అకౌంట్స్ కమిటీ, కాగ్‌లు ఇ.పి.సి. విధానంలో అవకతవకలను బయటపెట్టాయి. అభివృద్ధి చెందిన దేశాలలో చైనాలో కాని చేపట్టిన ఇ.పి.సి. నిర్మాణాలు 3 లేదా 5 సం॥ల కాలంలోనే పూర్తిచేసిన పరిస్థితి వుంది. మనదేశంలో దీనికి భిన్నంగా జరిగింది. ఆలస్యానికి కంట్రాక్టర్లు ప్రభుత్వానికి చెల్లించాల్సిన నష్టపరిహారం స్థానే వారికే ధరల సూచీ ప్రకారం ప్రభుత్వం అదనపు చెల్లింపులు జరిపింది. అన్ని రకాలుగా ప్రజాధనం వృధా అయ్యింది.

సంస్కరణల అమలు తర్వాత చేపట్టిన ప్రాజెక్టులు వలన నదీ ప్రవాహాలు, కాల్వల వ్యవస్థను దారిమళ్ళించి, ఆక్రమించి పర్యావరణ విధ్వంసం పెద్ద ఎత్తున జరిగింది. ఫలితంగా అనేక చెరువులు పూర్తి ట్యాంక్ మట్టం కన్నా తక్కువకు పెద్ద ఎత్తున తవ్వకాలు చేసి మట్టి, ఇసుకను తరలించారు. అనేక చెరువులు అదృశ్యమయ్యాయి. పరిమితులకిమించి నదులలో ఇసుక తవ్వకాలు జరుపుతున్నారు. వేల ఏళ్ళ నుండి ప్రజా నిర్మిత మరియు సహజనీటి వనరులు ఈ కొత్త అభివృద్ధి విధానాల వలన విధ్వంసానికి గురయ్యాయి.

ఈ క్రమంలో అభివృద్ధి అనే పేరుతో మాగాణి పొలాలను, నిర్బంధంగా సేకరించి, నూతన పారిశ్రామిక కేంద్రాలు (సెజ్) పేరుతో వేల ఎకరాల నుండి రైతు కుటుంబాల ఉపాధి అవకాశాన్ని దెబ్బకొట్టారు. రైతు కుటుంబాలు పట్టణాలకు వలసపోయి కూలీలుగా మారిపోతున్నారు. బొగ్గు, ఇసుక, పెట్రోల్, బాక్సైట్, ఇనుము, గ్యాస్ తవ్వకాలు, టెలిఫోన్, సెల్‌ఫోన్ తరంగాలు, ప్రభుత్వరంగం నుండి ప్రైవేట్ వారికి అమ్మడం వంటి ప్రైవేటీకరణ చర్యల ద్వారా వేలకోట్ల రూ॥ల ప్రజల సంపదను బందిపోటు దొంగల్లా పాలకులే తరలించి పర్యావరణ విధ్వంసానికి గురి చేస్తున్నారు. కొద్దిమంది కోటీశ్వరుల్ని తయారు చేస్తున్నారు.

ఉపాధి హామీ పథకం పేరుతో, వివిధ సంక్షేమ పథకాల అమలుపేరుతో ప్రజలను బిక్షగాళ్ళుగా మారుస్తూ, కులాలు, మతాలు, ప్రాంతాల పేర ప్రజలను చీల్చి ప్రభుత్వాలనేర్పరచి సహజవనరుల దోపిడి విచ్చల విడిగా చేస్తున్నారు.

బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా పోరాడిన కాలంలో గాంధీలాంటి నాయకులు ప్రజల్లోకి ప్రత్యక్షంగా వచ్చి ప్రజలను కార్యాచరణ ద్వారా కదిలించి సామాజిక చైతన్యాన్ని కలిగించారు. స్వాతంత్ర్యానంతరం కమ్యూనిస్టులు, సంస్కరణల వాదులు ప్రజలలో చైతన్యాన్ని కలిగించారు. నేడు గ్రామీణ ప్రాంతాలలో, పట్టణ ప్రాంతాలలో ప్రజల గూర్చి ఆలోచించేవారు భవిష్యదర్శనం కలిగించి ప్రజలను కదిలించేవారు ఎక్కడా కనిపించడం లేదు. మావోయిస్టులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడుతున్నా, తీవ్రమైన రాజ్య నిర్భందం పోరాడేవారిని భౌతికంగా ఎన్‌కౌంటర్ల పేరుతో నిర్మూలిస్తున్నారు. ప్రజలగూర్చి దేశ అభివృద్ధిని గూర్చి ఆలోచించేవారిని మావోయిస్టులుగా, తీవ్రవాదులుగా, దేశద్రోహులుగా చిత్రిస్తున్నారు.

ఈ నేపథ్యంలో పాలక వర్గ అభివృద్ధి నమూనాకు భిన్నంగా ప్రజల ప్రత్యామ్నాయ అభివృద్ధి గూర్చి విస్తృతంగా ప్రచారం చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా వుంది. ప్రజల సామూహిక ప్రతిఘటన చర్యలు మాత్రమే సోంపేటలాంటి చోట్ల విధ్వంసక అభివృద్ధిని ఆపగలిగాయి. ఈనాడున్న ప్రత్యేక పరిస్థితుల రీత్యా, రాజ్యం అంటే ప్రభుత్వ యంత్రాంగం మాత్రమేకాదు. అధికార పార్టీ, ప్రతిపక్ష పార్టీ, మీడియా, విదేశీ నిధులపై ఆధారపడి పనిచేసే ఎన్.జి.వోలు, వీరి అభివృద్ధి దృక్పథంలో తేడా లేదు. అందరూ ప్రజా వ్యతిరేక విధ్వంసకర అభివృద్ధిని కొద్ది మార్పులతో ఆమోదిస్తున్నారు.

చిన్ననీటిపారుదల రంగంలో చెరువుల ద్వారా వ్యవసాయం చేయడం పురాతన కాలం నుండి అమలులో వుంది. 13వ శతాబ్దంలో నిర్మించిన రామప్ప, లక్నవరం చెరువులు, తెలంగాణా ప్రాంతంలో గొలుసుకట్టు చెరువుల వ్యవస్థ దీనికి తార్కాణం. చెరువుల నీటిని వ్యవసాయానికే కాకుండా, ఇతర అవసరాలకు వినియోగించేవారు. చెరువులలో పేరుకుపోయిన మట్టిని పంట చేలలో వేసి నేలలను సారవంతంగా చేసుకునేవారు. కొండలు, గుట్టల మధ్యనున్న భాగాన్ని నింపడం ద్వారా సహజ సిద్ధమైన చెరువులు ఏర్పడ్డాయి. 10 ఎకరాల కన్నా తక్కువ పారకం కలిగిన వాటిని కుంటలుగాను, ఎక్కువ ఆయకట్ అనగా 30 నుండి 100 ఎకరాలకు పైగా పారకం కలిగేవాటిని చెరువులుగా పిలుస్తారు. సాగు, త్రాగునీరే కాకుండా, పశువులకు, చేపల పెంపకానికి ఉపయోగపడి అనేకమందికి జీవనోపాధి కల్పిస్తాయి. ప్రకృతి సమతుల్యతకు, చెరువులు ఎంతగానో ఉపకరిస్తున్నాయి.

బ్రిటీష్‌వారికి ముందు చెరువుల నిర్వహణలో రైతులే పాలుపంచుకునేవారు. ఇంటికి ఒకరు చొప్పున శ్రమదానం చేసి కాల్వలు శుభ్రంచేయడం, చెరువులో పూడికతీసి బండ్ల ద్వారా పొలాల్లో వేయడం కరకట్టలుగట్టి చేయడం చేసేవారు. బ్రిటీష్ వారి కాలంనుండే చెరువులు రాజ్యం నిర్వహణలోకి తెచ్చారు. స్వాతంత్ర్యానంతరం అధికారంలోకి వచ్చిన పాలకులు భారీ ప్రాజెక్టులపై చూపిన శ్రద్ధ చెరువుల నిర్వహణలో చూపించలేదు. ఫలితంగా అనేక చెరువులు శిధిలావస్థకు చేరుకున్నాయి. కొన్ని ఆక్రమణకు గురయ్యాయి. భూస్వామ్య వ్యవస్థ బలంగా వున్నకాలంలో చెరువుల కింద భూములు ఆధిపత్య కులాల వారే ప్రధానంగా వుండడంతో తమ ప్రయోజనాలకోసం చెరువులను పరిరక్షించేవారు. విధ్వంసకర అభివృద్ధి నమూనా ఫలితంగా భూస్వాములు, ఆధిపత్య కులాలవారు ఇసుక, ఎక్సైజ్, పెద్ద కాంట్రాక్టర్లుగా అవతరించి నగరాలకు వలసవెళ్ళడం, ఆరు రహదారుల రోడ్లు, అభివృద్ధి కార్యక్రమాల కొరకు పెద్ద ఎత్తున ఇసుక, మట్టి తవ్వకాలు జరపడం, అడవులు నరకడంతో పర్యావరణ విధ్వంసంతో పాటు కాల్వలు నిర్వహణ లేక ఆక్రమణకు గురై చెరువులలో నీరు రావడం తగ్గిపోయింది.

చెరువుల మరమ్మత్తులు, కాల్వల వ్యవస్థకు ప్రజల భాగస్వామ్యంతో బాగుచేయడం, చెట్లుపెంచడం, పూర్తిస్థాయి ట్యాంక్ మట్టం దిగువకు మట్టి త్రవ్వకాలు నిరోధించడం, చెరువులలో లీకేజిని అరికట్టి, పూడిక తొలగించి వర్షాకాలంలో నీరు నిల్వచేయగల్గితే భూగర్భ జలాలు పెరుగుతాయి. ఇది 3 నుండి 5 లక్షల ఖర్చు ద్వారా త్వరితంగా 2 నెలలలోనే ప్రతీ చెరువు మరమ్మత్తులను పూర్తి చేయవచ్చు. గ్రామాలలో పశువులకు నీరు, త్రాగునీరు, చేపలపెంపకం, వ్యవసాయం ద్వారా ప్రజలకు ఉపాధి సౌకర్యాలు పెరుగుతాయి.

ప్రజలందరికి ఉపాధి కల్పించే విధానాలు రూపొందించి ప్రచారంలో పెట్టాలి. గ్రామీణ ప్రాంతాలలో విధ్వంసకర అభివృద్ధికి వ్యతిరేకంగా (ఇసుక మాఫియా), ప్రజలు సంఘటితమై పోరాడాలి. పర్యావరణ పరిరక్షణ, వర్షం ద్వారా కురిసిన నీటిని పరిరక్షించుకోవడం. ఏ ప్రాంతంలో కురిసిన వర్షపునీటిని రైతులు తమ భూములలో, కుంటలు నిర్మించి, కొంతభాగం గడ్డిపెంచి వర్షపునీరు భూమిలోకి ఇంకేటట్లు చేయాలి. ఇసుక తవ్వకాలు నిలిపివేసి వర్షపునీరు భూమిలోకి ఇంకితే కొద్ది సం॥లలో వాతావరణ మార్పులు జరిగి భూగర్భ జలాలు గణనీయంగా పెరుగుతాయి. జాతీయంగా, అంతర్జాతీయంగా జరిగిన పరిశోధనలు, ఈ వాస్తవాన్నే నిరూపించాయి. గ్రామీణ ప్రాంతాలలో వున్న చెరువులు, పాటు కాల్వల వ్యవస్థను పునరుద్ధరించి చెరువులు, కుంటలలో నీరు నిల్వచేయడం ద్వారా, చెరువుల కింద అధిక నీటి వాడకం వుండే వరి పంటకు బదులు చిరుధాన్యాలు పండించడం, శాస్త్రీయ పద్ధతిలో మట్టి నమూనాలు పరీక్షించి అవసరమైన మోతాదులోనే ఎరువులు వాడకం, రసాయనిక ఎరువుల వాడకం పూర్తిగా నిలిపివేసి సాంప్రదాయ విధానాలు, వర్మీ కంపోస్టు వంటి విధానాల ద్వారా ఉత్పత్తిని, పంట దిగుబడిని పెంచే విధానాలు అనుభవజ్ఞులైన రైతుల సలహాలతో ప్రజలను సామూహికంగా కదిలించి, ప్రజలపై ఆధారపడి ప్రజల భాగస్వామ్యంతో పునర్‌నిర్మాణం చేయాల్సి వుంది.

గ్రామీణ ప్రాంతాలలో భూసంబంధాలలో మౌలిక మార్పులకు శ్రీకారం చుట్టాలి. వ్యవసాయం చేయకుండా పట్టణ ప్రాంతాలలో ప్రత్యామ్నాయ వ్యవహారాలు వ్యాపారాలు చేస్తున్న వారి భూములను స్వాధీనం చేసుకుని ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి సాగుచేస్తున్న కౌలుదారులకు, వ్యవసాయ కూలీలకు భూమిపై హక్కు కల్పించాలి. ప్రభుత్వ బంజరు భూములపై భూమిలేని వారికి హక్కు కల్పించాలి. వ్యవసాయం చేసే రైతులకు విత్తనాల కొరత, అప్పులు, ఎరువుల కొరత, కూలీల కొరత, విద్యుత్‌కొరత, గిట్టుబాటురేటు ఇవ్వకపోవటం, నీటికొరత, తుఫానులు, కరువులు తీవ్ర సమస్యలుగా వున్నాయి. పాలకులు కార్పొరేట్ కంపెనీల వత్తిడికి లొంగిపోయి రైతు వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నారు.

అధికార పార్టీ, పతిపక్షపార్టీ లేదా వామపక్ష పార్టీలు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై స్పందించడం లేదు. ఆధిపత్య కులాలలోని ఆస్తిపరులు వ్యవసాయం వదిలివేసి పట్టణ ప్రాంతాలలో స్థిరపడి కంట్రాక్టర్లుగా, పంక్షన్ హాళ్ళు, తోటల యాజమానులుగా రియల్ ఎస్టేట్‌లో మునిగిపోయారు. వీరికి వ్యవసాయం ప్రధాన వ్యాపకం కాదు. కౌలుదార్లకు ఋణ సౌకర్యం లేక అప్పుల వూబిలో ఇరుక్కుపోయి ఆత్మహత్యలు చేసుకుంటున్న వారిలో ఎక్కువమంది కౌలుదార్లు, పేద రైతులే.

క్రింది వర్గాల వారు ప్రధానంగా భూమిలేని కూలీలుగా వుండి, కోత యంత్రాలు, ట్రాక్టర్ల వలన ఉపాధికరువై ఉపాధి హామీ పనులలో చేరి ప్రభుత్వం ఇచ్చే సంక్షేమ పథకాలైన ఇందిరమ్మ ఇల్లు, తెల్లకార్డులు, ఆరోగ్యశ్రీ, వృద్ధాప్య పింఛన్‌లు పొందుతూ, భూమితో ఎటువంటి సంబంధం లేకుండా వున్నారు. ఇందిరమ్మ ఇంటి పథకం అమలులో అదనంగా అప్పులుచేసి అధిక వడ్డీభారం మోస్తూ అప్పుల పాలై వున్నారు. సహకార బ్యాంక్ వ్యవస్థ, వైఫల్యం వలన ప్రవేశించిన మైక్రో రుణాలు వలన వ్యవసాయ కూలీ కుటుంబాలు తీవ్రమైన రుణభారంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత కాలంలో వ్యవసాయ కూలీలకు కొద్దో గొప్పో భూమి కలిగి వుండి రైతాంగంతో కలిసి వున్న వీరు నేడు రైతులకు, కూలీలకు మధ్య సంబంధాలు బలహీన పడ్డాయి. వివిధ పథకాల వలన రాజ్య యొక్క కంట్రోల్‌లోకి వెళ్ళారు. ఆధునిక మార్కెట్ విధానాల వలన వీరు వివిధ రకాల ప్రభావాలలోకి వెళ్ళి పట్టణ జీవితం వైపు ఆకర్షితులై గ్రామాలలో గతంలోలాగ పనిచేయలేని పరిస్థితులు వున్నాయి.

లోకవిద్యాధరులైన రైతులు, వ్యవసాయ కూలీలు రాజ్యానికి, విధ్వంసకర అభివృద్ధి నమూనాకు పర్యావరణ విధ్వాంసానికి, వనరుల తరలింపుకు వ్యతిరేకంగా ప్రజలపై ఆధారపడి ప్రజాఅనుకూల అభివృద్ధి దృక్పథం వైపు ఉద్యమించాల్సి వుంది. చిన్ననీటి పారుదల రంగంలో, మార్కెట్ వ్యవసాయానికి భిన్నంగా ప్రజల అందరికి ఆహార స్వయం పోషకత్వం, విత్తన స్వయం పోషకత్వం, స్థానిక సంతలను పునరుద్ధరించటంలో కార్పొరేట్ రంగ విస్తరణకు భిన్నంగా ప్రజల ఉపాధి సౌకర్యాలు పెరిగే వైపు ప్రజలపై ఆధారపడిన అభివృద్ధిని ప్రచారం చేయాల్సి వుంది.

- కె.జె. రామారావు

**వ్యక్తిత్వ వికాసానికి సమాజంలో అందరికి ఉపయోగపడేది జ్ఞానం.**

# మానవుడే కేంద్రంగా నాగరిక సమాజం కొరకు

జీవిత సత్యం మరణమా? లేక సమస్యల నుండి విడుదల పొంది మరొక తెలియని నూతన జీవిగా ఆవిర్భవించడమా; మానవ జీవనపు చివరి మజిలీ 'స్వేచ్ఛ', 'ఆటంకాలతో' కూడి ఉంటుందా అన్నది నిర్ధారణకాని సత్యం. కాని జీవన ప్రస్థానంలో మనిషి 'జీవితాన్ని' నిజాయితీగా లేక అవకాశవాదంతో ఏ పద్ధతిలో జీవించాడన్నదే అతిముఖ్యం.

'ప్రకృతి' సహజంగా నశించే జీవజాలంతో కూడి, పుట్టిన ప్రతిజీవిని మళ్ళీ తనలో వ్యర్థపదార్థంగా కలుపుకుంటూ ఉంది. ఈ మొత్తం ప్రక్రియ ఎంత నిర్మాణాత్మకంగా ఉంటుందంటే జీవన చక్రం సాఫీగా నడవడంలో ఎటువంటి అవరోధాలను అదే సృష్టించుకొని దాని అడ్డంకులను అధిగమించే మార్గాలనన్వేషించేటటువంటి ఆస్కారం ఉండదు. అది తనకు తాను సంపూర్ణంగా, సమస్త జంతు, వృక్ష కోటికి జీవనాధారంగా, మానవజాతి 'నాగరికతల' పురోభివృద్ధికి కావలసిన 'వనరులను' ఎప్పటినుంచో అందిస్తున్నది. ఏ జీవనచక్రంనుండి ఉద్భవిస్తున్నామో ఆ జీవన చక్రంలోనే ఐక్యమవడం అనే ప్రక్రియ 'వంక' పెట్టరానిది.

అయితే దీనికి భిన్నంగా ప్రస్తుతం అనుసరిస్తున్న 'మానవనాగరికత', సమస్యల వలయాలు సృష్టించుకొని నివారణోపాయలు వెదకడంలో అమిత సంతోషాన్ని అనుభవిస్తున్నది. ప్రకృతి ధర్మానికి విరుద్ధంగా నాశనం లేని యంత్ర మృగాల్ని, పదార్థం సహజ సిద్ధంగా నశించని ప్రక్రియను, గుప్పెడు మంది తమకు లేని నిర్ణయాధికారంతో సమస్త వనరుల్ని, అధికారాన్ని కైవసం చేసికొని దానికి అనుకూలంగా ఒక సిద్ధాంతాన్ని మలచుకొని దాన్ని సమస్త ప్రపంచ ప్రజానీకానిపై 'రుద్దడం' - అది ప్రతీ రంగంలోనూ రాజకీయ, ఆర్థిక, విద్య, కళ, సైన్సు, నాగరికత -ఇంకా ఎన్నో.

ఆధునిక సమాజాలు నేడు ముందుగా "నిర్ణయించిన" ప్రోగ్రాము చేయబడిన మరయంత్రాల్లా కొద్దిమంది పాలక వర్గం అదుపాజ్ఞలలో ఉంటూ వారి ఆజ్ఞలను తూచ తప్పకుండా అమలుపరచడం మనం చూస్తున్నాం. వారు ప్రకటించే 'సైన్సు', 'పురోభివృద్ధి', 'సత్యాన్ని' కనుగొనడంలో వారికున్న ఆత్రుతను మనం ప్రశ్నించడం లేదు. అయితే ప్రశ్నించడానికి "వీలులేని అభ్యంతరం" ఒకటుంది. అది 'ఆధునిక నాగరికత' అనే భావన, ఈ ఆలోచన సమాజాల్ని, ప్రత్యేకించి భిన్న సామాజిక వర్గాలను అసహాయస్థితిలోకి నెట్టి వారిని నిర్ధాక్షిణ్యంగా 'సామాన్య సమాజాలుగా' తీర్చిదిద్ది తన దోపిడిని యదేశ్చగా కొనసాగించడం- ఈ అసహాయులపై జరుగుతున్న దోపిడి కళ్ళెదుట స్పష్టంగా కనిపించుతుంటే యిక వాదనలెందుకు. ఎప్పటికైనా 'సత్యానికి' కప్పిన ఈ ముసుగు తొలగవచ్చు, లేక తొలగించబడవచ్చు. అయితే వ్యక్తుల జీవితాల్లో సహజాతాలైన ప్రజ్ఞాపాటవాలను, జీవన వైవిధ్యాలను దొంగిలించి పైగా వాటిని అబద్ధాలుగా ప్రకటించడం దుర్మార్గం.

### దేవుడు - పరమాణువు

తర్కానికి, హేతుబద్ధతకు అందనటువంటి ఒక 'స్థితి' తనకు తాను ఏర్పాటు చేసుకున్న స్వయం నియంత్రణ చట్టాల ఫలితమే ఈ ప్రకృతి, సమస్త విశ్వం ఆవిర్భావం; ఇది మనకు తెలియని మేధో కార్యంగా చెప్పవచ్చు. ఒకవేళ యిది తలవని తలంపుగా జరిగినా, ఒక అద్భుత, ఆహ్లాదకరమైన సమ్మిళిత భావనగా మేధస్సుగా యీనాటికి యీ ఆవిర్భావరహస్యం మొదటినుండి నేటివరకు అంతుచిక్కలేదు. 'సృష్టి' ప్రణాళికలో 'కాలం' నిరంతరం సాగే ఒక అంతర్భాగమేకాని, ప్రత్యేకంగా, స్వతంత్రంగా ఉండదు. కాబట్టి 'కాలం'పై ఆధారపడ్డ ఏ సంఘటనను తమకు అనుకూలంగా మార్చటం ప్రకృతి విరుద్ధం. అందువలన విశ్వంలో జరిగే పలు సంఘటనలను ఆధారంగా చూపి తమకు అనుకూలంగా సూత్రీకరణలు చేయరాదు.

ప్రకృతి, విశ్వం భిన్న స్వరూపాలు కలవి. వాటిలో జరిగే సంఘటనలు కాకతాళీయాలే. అయినా వాటిమధ్య ఒక అవినావభావ సంబంధం కాలంతో ప్రమేయం లేకుండా సాగుతూ, పునరుజ్జీవనంతో కూడి ఉంటుంది. వాటిలో 'హింస' ఒక అంతర్భూతంగా ఉన్నప్పటికి అందులో నివసించే 'జీవజాలం' ప్రాణ రక్షణకు అనుసరించాల్సిన పద్ధతులు ఏర్పాటైనాయి. 'జీవం' లెక్కించలేని రూపాల్లో కొనసాగుతుండగా మరణం తథ్యమని తెలిసినా ప్రతిజీవి స్వతంత్రంగా తన మనుగడను సాగించడానికే యిష్టపడుతుంది. ఇది జీవిత 'సత్యం'.

సృష్టి ఎవరి ద్వారా జరిగిందనేది వివరణకు సాధ్యంకాని, గొప్ప మేధస్సుతో, సంభ్రమాశ్చర్యాలతో ముంచే ఈ రూపకల్పన నిర్దేశించిన సహజ నాగరికత ఇది. సృష్టికి గల కారణం, హేతుబద్దత, మేధస్సు ద్వారా నిర్ణయించలేం. అయితే నేను దీనికి 'దేవుడు' అనే నామకరణం చేస్తున్నాను.

లోకవిద్య జనాందోళన ఆధునిక నాగరికతకు ముందు దశను ఆకాంక్షిస్తుందా? విశ్వంలో మనకగుపించే లెక్కించలేని ప్రాణికోటిలో మానవుడు ఒక అల్పపరిమాణం గల జీవి అయినా ఆవ్యవస్థలో అత్యంత మేధస్సు కలిగిన వాడిగా పరిగణిస్తున్నాను. (ఒక భావన) ప్రస్తుతం నడుస్తున్న ఆధునిక నాగరికత రూపశిల్పి దేవుడు సృష్టించిన సహజ జీవనాగరికతకు వ్యతిరేకంగా; యంత్రమానవ నాగరికత, తన ముందు నాగరికతల విధ్వంసకారి, కాలము, పదార్థాల వినాశకుడు, మానవ జాతిని ఒక మూసలో కుదించగలవాడు, దేవుడు సృష్టించిన సహజ జీవన నాగరికతకు పదార్థాన్ని అతిసూక్ష్మ కణంగా మార్చడం (ఎలక్ట్రాన్ పుట్టుక) కలిసిసాగిపోతున్న విశ్వవిస్తరణ, కాలాన్ని విడగొట్టి చూడగల సామర్థ్యం మనిషికి (అంతులేని) ప్రకృతిని తన స్వార్థాని కనుగుణంగా మలచుకోగలిగిన శక్తి, సహజసిద్ధమైన రూపాల్ని తన ఇష్టప్రకారం మార్చుకోగల పరిస్థితి ఏర్పడింది.

వలసవిధానం దాని లక్ష్యం - లక్ష్యానికి దన్నుగా మానవ జాతి మొత్తాన్ని తుడిచిపెట్టగల మారణాయుధాలు దానిస్వంతం, దానిప్రతి నూతన సృష్టి దైవస్వభావంకల నాగరికతకు ప్రతిగా సామర్థ్యం లేని విధానాలతో క్రూరస్వభావం కలిగి, అన్ని రకాల అస్తవ్యస్థ పరిస్థితుల్ని, అసమానతలను ప్రవేశపెట్టి దానినే సైన్సు టెక్నాలజీలనే అద్భుతాలుగా మనకు చూపిస్తున్నాయి. ఇది దైవస్వభావ నాగరికతకు వ్యతిరేకచర్య. ఈ పద్ధతిలోకి ప్రవేశపెట్టబడిన యాంత్రిక మానవులు ఒకపక్క జీవితమే చివరి అంచుల్లోకు చేరి నిర్జీవంగా మారుతున్నా లెక్కకు మిక్కిలిగా దొరుకుతున్నా ఎలక్ట్రానిక్ వస్తువుల మత్తులో తేలుతూ వాటినే 'సుఖానికి' పర్యాయాలుగా భావిస్తున్నారు. సుఖాలే జీవిత పరమావధి అన్న రీతిలో 'కలవారు' వాటిని స్వంతం చేసుకుంటుంటే లేనివారు తమ 'లేమితన్నాని' పొగుచేసు కుంటున్నారు. తమ కళ్ళతో చూడకపోయినా 'ఎలక్ట్రాన్' ఉనికి నమ్మువారు ఎటువంటి సందేహంలేకుండా నమ్ముతున్నారు. అయితే పేదలు దేవుడు ఉనికిని విశ్వశిస్తూ, దాని ప్రతిరూపాలైన అతనిని, ఆమెను, ఉన్నది అనే దానిని తమకు దర్శనీయంగా భావిస్తున్నారు. ఒకరు యాంత్రిక మానవ నాగరికతలో ప్రగాఢ విశ్వాసం ప్రకటిస్తున్నారు. మరొకరు దేవుడు నాగరిత ఒడిలో బ్రతకాలని కోరుకుంటున్నారు.

### సంకుచిత పరిధి - బాధితుడు

తప్పుడు భావనగా; ఉనికిలో, ప్రవేశపెట్టిన విధానాలు యాంత్రిక నాగరికత. జనబాహుళ్యం కలిగిన భారత ప్రజానీకాన్ని తనలో ఇముడ్చుకోలేకపోగా అతికొద్ది మందికి మాత్రమే సుఖప్రద జీవితాన్ని యిస్తూ సహజ జ్ఞానంతో గౌరవప్రదంగా జీవిస్తున్న విస్తృత ప్రజా సమూహాల లోకవిద్యాధర సమాజాన్ని బలిపశువును చేసింది. కాబట్టి అది ప్రజల్ని తన కొలబద్దతో అట్టడుగు పేదరికంలో ఉన్నవారుగా గుర్తించి, కొన్ని పథకాలు, తక్కువ కూలి ఉపాధి కల్పన వంటి వాటి ద్వారా సమాజంలో ఒక నాగరికతగా ఒక విడదీయరాని భావనగా తయారు చేయడం "లేని వారిని" గురించి ప్రేమతో కానేకాదు. అశాంతి నెలకొనకుండా అడ్డూఅదుపూ లేని (ప్రస్తుత నాగరికత) ఆర్థిక విధానాలతో కొనసాగుతున్న ప్రస్తుత నాగరికత స్థిరత్వానికే. కాంక్రీటు మహారణ్యాలు, నిత్యం రాకెట్టు వేగంతో నింగినంటుతున్న రియల్ ఎస్టేటు ధరలు, పైపై కెదుగుతున్న జీవన ప్రమాణ సూచికలు నేడు ఎదుగుదల వృద్ధికి పర్యాయపదాలుగా నిలిచాయి. విపరీతంగా పెంచబడ్డ విలువతో నిర్మించబడుతున్న భవనాలు, రోడ్లు, ఎలక్ట్రిసిటి మొదలైన కీలక సదుపాయాల పేరిట వాటికి దన్నుగా సహజ వనరులను తరలిస్తుండడమనే ప్రక్రియ నేడు అత్యధిక ప్రాధాన్యాన్ని సంతరించుకుంది. తద్వారా లోకవిద్యాధర సమాజానికి చెందినవారిని తన పరిధిలోని 'కూలి' అడ్డాలకు వేగంగా తరలించగలుగుతుంది. మొత్తం అభివృద్ధి పనులు యంత్రాల ద్వారా చేసి అత్యధిక లాభాలార్జించవచ్చని మంచి ఆర్థిక ఆలోచనగా అభినందనలు అందుకోవచ్చు. కాని కార్మికులకు పని కల్పించడమనేది ఒక 'రాజకీయ' అవసరం.

లోకవిద్యాధర సమాజం నుండి తీసుకరాబడ్డ కూలీలు మొదటి ప్రస్థానం మురికివాడలు. వారి ఎదుగుదల అక్కడ నుండి మొదలై అక్కడే ఉండడానికి వారికి అనుమతి లభిస్తుంది. మురికివాడలు మంచి జీవితానికి ముఖ ద్వారాలు. (ఈ అభిప్రాయం ఉన్నవారిచే, లేనివారిచే ఆమోదింపబడింది) ఎందుకంటే రాబోయే లోకవిద్యా తరం ప్రజలు మురికి వాడల జీవన ప్రభావంతో అడ్డు అదుపు లేని 'నేరాల' అభివృద్ధిగా ఉండగలరు. దురదృష్టవశాత్తు 'నేరాల ఎదుగుదల' ఎక్కువ అభివృద్ధి రేట్లను ముందుకు నెట్టగలదు. ఎందుకంటే నేరాలను అదుపులో ఉంచడానికి శాంతిభద్రల సిబ్బందిని ఎక్కువగా నియమించి వారికి అత్యంత ఆధునికమైన విదేశీ ఆయుధాలు, మందు గుండుసామాగ్రి, దానికి మారక ద్రవ్యంగా యంత్ర సామాగ్రి, ముడిసరకులు, వస్తువులు, బట్టలు, వ్యవసాయోత్పత్తులు మొదలైనవి ఇచ్చి రూపాయి మారకం విలువ తగ్గించవచ్చు.

### భిన్నధృవాలుగా

ఈ విడిపోవడం అనేది నాగరికత ఆధారితం. వికేంద్రికరణపై కేంద్రీకృత అజమాయిషి విధానం, అలుపెరగని నిరంతర మానవ పోరాటం. మనిషి కన్న యంత్రానికే ప్రాధాన్యత, యంత్రాలతో పనిచేయించడమా లేక కోట్ల మష్కిస్తాలు, చేతులు, ఒకచోట చేరిన మేధస్సా, లేక పంచబడ్డ ప్రజావిజ్ఞానమా? అధికారంలో అణచబడటమా లేక స్వతంత్ర జీవనమా ఇది ఇప్పుడు తుడిచి వేయబడ్డ నాగరికత, లోకజన విద్యజనాందోళన (ఎల్.జె.ఏ) ద్వారా ఏకీకృతమై పునరుజ్జీవం పొందగలదా? లేక ప్రస్తుత శత్రువైన ఆధునిక సమాజం నుండి కొన్ని రాయితీలను పొందడమేనా?

ఈ ప్రశ్నను గురించి ఆలోచించడం అవసరం. ఎందుకంటే అది ఒక్కటే ఎల్.జె.ఎ. రాబోయేకాలంలో ఏ రూపం సంతరించుకుంటుందో ఏరకంగా ఈ సమస్యకు మార్గం వెదుకుతుందో తెలుస్తుంది. మన కఠిన ప్రయత్నం రాబోయే నాగరికతలో చూడగలమా - అటువంటప్పుడు ఆధునిక నాగరికత మూలాల్ని గురించి ప్రశ్నించవలసి వస్తుంది.

నా అభిప్రాయంలో అతిముఖ్యమైన, సందర్భానుసారంగా చర్చించాల్సిన విషయం ఒకటుంది. ప్రస్తుతమున్న విధానాలను వదలివేయాలన్న ప్రశ్న వచ్చినప్పుడు, రాజ్యం ప్రయోజనాలు, వ్యక్తుల, సమాజాల, సమూహాల ప్రయోజనాల కన్నా ముందుండాలా? లేక దానికి భిన్నంగానా? ఎప్పుడైతే కొత్త భాషలో "విద్యాహక్కు, జీవించే హక్కు, ఆస్తికలిగి ఉండే హక్కు మొదలైన నినాదాలు ఆరాధించబడుతున్నపుడు ఏరకమైన విద్య, జీవితం, ఆస్తులను ఒకరు ఊహించగలగాలి. 'సమానత్వహక్కు' ఇది మనకు రాజ్యంగంలో ప్రజలందరికి యిచ్చిన ముఖ్యమైన హక్కు. ప్రస్తుత కళ్ళెదుట అగపిస్తున్న అసమానతల సమాజానికి, భారత రాజ్యాంగంలో చెప్పినదానికే సమన్వయం లేనప్పుడు, ఈ 'హక్కు' చర్చించదగినది.

దేశంలో అసమానతలకు అధిక జనాభాను ముఖ్య కారణంగా చూపరాదు. మనది అధిక జనసాంద్రత కలిగిన దేశంగా మిగతా దేశాలతో పోల్చవచ్చు. అయినప్పటికి ప్రజల లాభకరమైన ఉపాధికి కావలసిన పథకాలను ప్రభుత్వమే ప్రవేశపెట్టి అవి సజావుగా నడిచే ఏర్పాటు చేయాలి లేదా ప్రజలకు ఉపాధి అవకాశాలు సృష్టించి వారికి వారే లాభసాటి ఉపాధి కల్పించుకునే ఏర్పాటు చేయాలి. యింతకు మించి జనాభా ఉండకూడదని మన రాజ్యాంగం హద్దులు ఏర్పరచలేదు. అధిక జనాభా గురించి మాట్లాడే వారు తాము అందులో భాగస్వాములేనన్న విషయం మరచిపోరాదు.

### జీవనోపాధి నిర్ణయ హక్కు

ఎల్.జె.ఎ. స్పష్టంగా తన డిమాండ్ జీవనోపాధి నిర్ణయ హక్కును అంటే ఎవరి కిష్టమైన వృత్తినివారు ఎన్నుకోవడం! వ్యయసాయం, చేనేత నూలువడకడం, వడ్రంగం వంటి వృత్తులన్ని కుటుంబ ఆధారితాలు. కాబట్టి వాటిని ప్రోత్సహించాలి. కుటుంబాలలో ఆవృత్తులకు సంబంధించి మెరుగైన పరికరాలు అందిస్తే కొంతకాలానికి వాళ్ళ వృత్తులలో నిలదొక్కుకొని మార్కెట్‌లో పోటీ పడగలరు. ప్రోత్సాహకాలు ఈ పరిశ్రమల స్థాపనకిచ్చే స్థాయిలో ఉండాలి.

లాభసాటి వ్యవసాయం లేని పరిస్థితులలో భూమి కలిగి ఉండటం అనే హక్కు అర్థరహితం ఎందుకంటే భూబకాసురులు ఎప్పుడు వనరులు లేని వ్యవసాయ భూములను లాక్కుని వాటిని పడావులుగా ఉంచుతున్నారు. సాగుకు తగిన పరిస్థితులు లేక వ్యవసాయం మానుకున్న భూములకు తగిన పరిస్థితులు ప్రభుత్వం కల్పించి పారిశ్రామిక వేత్తలకు యిచ్చే ప్రోత్సాహాల స్థాయిలో వ్యవసాయ దారులకు అందించాలి. వ్యవసాయ యోగ్యం కాని నిస్సారమైన భూములను 'భూమికలిగే హక్కు' నినాదం నుండి తొలగించాలి.

ఎవరైనా ఘజియాబాద్, నోయిడా, గురుగావ్, ఫరీదాబాద్ ప్రాంతాలకు పోవడం తటస్థిస్తే పెద్ద సంఖ్యలో, అతిపెద్ద బహుళ అంతస్తుల గృహ సముదాయలు, అపార్టుమెంట్లు మనం చూడవచ్చు. అవి ఎంతపెద్దవంటే కొన్ని వందల సామాన్య పల్లెలకు ఆవాసంగా ఉండగలవు. ఈ రాకాశి ఇళ్ళు 24 గంటలు నీటి సరఫరా లేనిదే మన జాలవు. అందువలన నదుల నుండి నీరే గాక భూగర్భ జలాలు కూడ వాటి వినియోగనిమిత్తం అందించాలి. ఆధునిక నాగరికత ప్రతిరూపాలైన వాటి వంటిళ్ళు, బాత్‌రూమ్‌లకు రోజుకు లక్షల కొద్ది గాలన్ల అదనపు నీరు అందించాలి. ఒకవైపు 'ఆర్థిక అభివృద్ధి' పేరిట నీటిని అందిస్తూ (రెండోవైపు) వ్యవసాయా అవసరాలకోసం వచ్చే సరికి 'సరిపోవు' 'దొరకవు' అనే మాటలు చెప్తున్నారు. సాగుకు అనుకూలమైన భూములు గల వ్యవసాయదారులకు నీటివసతి, అదనపు పనిముట్లు (విత్తనాలు, ఎరువులు) మొదలైనవి లేకపోతే వారు దోపిడి దారులచేతిలో కీలుబొమ్మగామారి తన వృత్తి పరమైన ఉపాధి నుండి దూరం చేయబడి 'కూలీగా' మారగలరు. ఆవిధంగా అతనికిష్టమైన వృత్తిని నిరాకరించి తద్వారా అతని శక్తి యుక్తులు, తెలివి, నిర్ణయాలు తీసుకొనే సామర్థ్యం నిర్ధాక్షిణ్యంగా అణచివేయబడి ఎవరో అపరిచితుడు నిర్దేశించిన అబద్దపు జీవితం గడపవలసి వస్తుంది. ఎలా, ఎప్పుడు, ఏ పరిస్థితులలో లోకవిద్యాధర సమాజానికి చెందిన ప్రజలు తమ ప్రతిభను పెట్టుబడిగా పెట్టగలరు. ఈ ప్రశ్న మీద చర్చ జరగాల్సిందే. కార్మికులు వలసపోయేది ఆకలిబాధ తీర్చుకోవడానికే. అది ప్రత్యామ్నాయం దొరికే వరకు సాగుతుంటుంది. అయితే ఈ సమయంలో లోకవిద్యాధర సమాజం లోకవిద్యాధరుల వృత్తి నైపుణ్యాలను ప్రతిబింబించే ప్రత్యమ్నాయ మార్గాల కై పనిచేయాలి. ప్రత్యామ్నాయ మార్గా న్వేషణ ఒక ఉద్యమంగా ముందుకు సాగాలంటే లోకవిద్యజనాందోళనలో ఈ కొనసాగుతున్న ఆధునిక విధానాల నుండి ప్రజల విముక్తి ఉండదని కేవలం ఒక నెరవేరని ఆశగానే మిగిలిపోగలదనీ, గట్టి నమ్మకం కలిగి ఉండాలి. లోకవిద్యాధర సమాజం చేపట్టిన సమస్యలలో ఒకటైన రైతులు మరియు చేతి వృత్తుల సమాజాలకు ప్రతిపంచవర్ష ప్రణాళికలో తగినన్ని నిధులు కేటాయించాలనే పిలుపు. దానికి తోడుగా వీరు పండించిన పంటలకు మధ్యవర్తుల ప్రమేయంలేకుండా గిట్టుబాటు ధరలు పొందడానికి గ్రామీణ మార్కెట్లు పునర్నిర్మాణం కొరకు చేయబడే తీర్మానం ప్రస్తుతమున్న యంత్ర యుగపు స్వార్థానికి నిరసనగా ఒక ఉద్వేగపూరిత భావప్రకటనగా వారి సంఘటిత వ్యతిరేకతను తెలియజేయాలి.

**డా. లలిత్‌కుమార్ కౌల్, ఎల్.జె.ఏ వ్యవస్థాపక సభ్యులు**

**Printed, Edited & Published by T. Narayana Rao B.Com., LL.B. D.No. 10-100, New Gaddiannaram, Behind Shivaganga Theaters, Saroornagar (M), R.R. Dist. A.P.- 60**
**Printed at : M/s Print Point, H.No. 5-14, Opp. Megha Theatre lane, Durganagar, Dilsukhnagar, R.R. Dist. A.P.-500 060.**

RNI Regd. No. APBIL/2012/50668 Postal Regn. No. HSE/677/2013-2015



## ہندوتان کی عوام اور اسکی گربت ـ حصہ ۹

مذہب کے نام پر ایک دوسرے کے دلوں میں خوف پیدا کرنے کی بےایمانی جو سیاستدان کرتے آرہے ہیں اسے کیسے سبی مذہبوں کے لوگ ملکر جواب دے سکتے ہیں؟ اس سوال پے سوچنا ضروری ہے اگر ہم اپنے سماج کو بربادی سے بچانا چاہتے ہیں. یہ تو مانی ہوئی بات ہے کہ کسی بھی سماج میں کوئی بھی انسان اسکے تورترکوں سے پہچانا جاتا ہے، پھر وہ کسی بھی مذہب کا کیوں نہ ہو. ایک دن میں کوئی کتنی ہی بار مندر مسجد گردوارہ یا گرجاگر کیوں نہ جاتا ہو، لیکن سماج میں اسکی پہچان صرف اسکے توڑترکوں سے ہوتی ہے. اپنے اپنے خدا یا بھگوان کی عبادت کرنے باوزود اگر اسکا ویوھار سہی نہ ہو تو لوگ اسے ڈونگی کہتے ہیں؛ ایسا کہتے ہواے کسی مذہب کا نام نہیں لیا جاتا اور ایسا کدرتی طور پر ہوتا ہے کیونکہ ہر بندے میں یہ ایک اندرونی احساس رہتا ہے کہ کوئی بھی مذہب کسی کو گلت کام کرنے کی عزازات نہیں دیتا. گلت کام اسے کہا جاتا ہے جسے سماج میں کسی بھی کسم کا نکسان ہوتا ہو. سمجھنے والی بات یہ ہے کہ کسی بھی بندے کی ایک اندرونی تاکت اور کمزوری ہوتی ہے. ایسی خاصیت ہر ایک کی اپنی اپنی ہے، انھ لیکر جب وہ دنیا میں روٹی روزی کمانے نکلتا ہے تو کچھ ایسے کام کرتا ہے جسکی عزازات اسکا مذہب نہیں دیتا؛ دنیائی کانوں سے بھی نہیں ڈرتا کیونکہ اسکی مزبریاں اسے غیر لیتی ہیں. ایک کمزور انسان اپنی کمزوری کا شکار بن جاتا ہے، پھر چاہے وہ کسی بھی مذہب سے واسطہ کیوں نہ رکھتا ہو. ایسے ہی کمزور انسانوں کی سوچ میں زہر گھولنے کی لگاتار کوشش میں رہتے ہیں سیاستدان اور مذہب کے ٹھیکیدار. انکے پاس بے انتہا وقت ہوتا ہے کیونکہ انھے روٹی روزی کمانے کی پریشانی نہیں ہوتی. مذہب سیدھی راح پے چلنے کی ہدایت دیتا ہے لیکن خود کی کمزوریوں سے اٹھنے کا تریکا تو خود ہی کھوجنا پڑتا ہے. مندر مسجد یا پھر کوئی اور عبادتگاہ جانے سے انسان مذہبی نہیں بنتا، تو پھر مذہبون کا آپسی جھگڑا کیوں؟

مذہب کا دہشت گردی سے کوئی نسبت

## 'ఉత్పత్తి' ప్రక్రియలో పెట్టుబడి లోకవిద్యాధర సమాజం అవగాహన

గత కొన్ని సంవత్సరాలుగా మీడియా, సమాజం, ఎప్పటికప్పుడు 'బంగారం' ధరల ఒడిదుడుకులపై ఆసక్తిని కనబరచడం గమనిస్తున్నాం. దీనికి కారణం పట్టణ ప్రాంత మధ్యతరగతి, గ్రామీణ భారత ధనిక వర్గం తమ పెట్టుబడులను 'బంగారం'లో నిల్వచేసుకొనడమే! ప్రభుత్వమేదైనా, ఆర్థిక మంత్రులు పెట్టుబడులను 'బంగారం'లో నిల్వచేసుకొనడమే! ప్రభుత్వమేదైనా, ఆర్థిక మంత్రులు పెట్టుబడులను 'బంగారం' పై కాకుండా, స్టాక్/షేర్ మార్కెట్లకు మళ్ళించమని ఎన్ని విజ్ఞప్తులు చేసినా పెట్టుబడిదారులు/ప్రజలు వాటిని పెడచెవిన పెడుతున్నారు. తాహతు కలిగిన పెట్టుబడి వర్గాన్నుండి 'డబ్బు' రాబట్టే ప్రక్రియలో భాగంగా బ్యాంకులు స్వయంగా 'బంగారం' అమ్మకాలు చేపట్టి, ఆ డబ్బును 'మ్యూచువల్‌పండ్స్'', 'బాండ్స్' తదితర రూపేణా పెట్టుబడి రంగాల్లోనికి, పెట్టుబడి/అప్పులుగా అందించాల్సి వస్తోంది. పెట్టుబడిదారి వ్యవస్థలో ప్రభుత్వం / రాజకీయ పార్టీలు / బడావ్యాపార సంస్థలకు ప్రజలు తమ పెట్టుబడిని 'బంగారం' రూపంలో పాతర వెయ్యకుండా, చలనాత్మకంగా ఉండే ఆర్థిక వ్యవస్థను కోరుకోవడం సహజం. మిగులు ధనాన్ని 'బంగారు' రూపంలో దాచే బదులు, ఉత్పత్తి ప్రక్రియలో మదుపు పెట్టడం విజ్ఞత అనే భావనను ప్రజల మెదళ్ళలోకి ఎక్కించడంలో ప్రభుత్వం విఫలమైంది. పర్యవసానంగా ప్రభుత్వం యితర ఆర్థిక సంస్థలు విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు చేయి సాచాల్సిన అగత్యం ఏర్పడింది.

దేశంలో ఆహారధాన్యాలు, వస్తూత్పత్తి చేసే రైతులు, చేతివృత్తులవారు, గిరిజనులు, స్త్రీలు, దళితులు, పారిశ్రామిక రంగ కార్మికుల అదనపు ఉత్పత్తి నిల్వనే 'బంగారం'గా చెప్పవచ్చు. ఈ అదనపు ఉత్పత్తి నిల్వలో కొంత భాగం తిరిగి ఆర్థిక వ్యవస్థలోని ఉత్పత్తి, సేవారంగాల్లోకి స్టాక్ మార్కెట్ల ద్వారా పాశ్చాత్య దేశాలతోపాటు వర్ధమాన దేశాల్లో చేరడం జరుగుతోంది. అయితే భారతదేశంలో ప్రాచీన కాలం నుండి నేటివరకు యీ అదనపు ఉత్పత్తి నిల్వను 'బంగారం' రూపంలో నిల్వచేయడం జరుగుతోంది. గ్లోబలైజేషన్ నేపథ్యంగా ప్రపంచ మార్కెట్ విస్తరించడంతో, ఉత్పత్తి-సేవారంగాల్లో భారీ పెట్టుబడుల అనివార్యత ద్వారా 'పెట్టుబడి'కి ఎనలేని డిమాండ్ ఏర్పడటం జరిగింది. 'వినియోగ' వస్తువులకు హద్దులు లేవు. ప్రతి వస్తువు వినియోగ వస్తువు క్రింద చలామణి అయ్యే మార్కెట్‌లో, వినియోగమే మార్కెట్‌ను నిత్య చలనంలో ఉంచుతుంది. ఇటువంటి ఆర్థిక వ్యవస్థలో 'డబ్బును' ఉత్పత్తి ప్రక్రియకు సంబంధంలేని 'బంగారం' రూపంలో నిల్వచేయడం, ఆర్థిక వ్యవస్థ పురోగమనాన్ని, తద్వారా స్వేచ్ఛా విపణిని అడ్డుకోవడమే అవుతుంది.

పెట్టుబడిపై 'నియంత్రణ', అది ఏ రూపంలో ఉన్నా, సామాజిక, ఆర్థిక రంగాలపై ఆధిపత్యం కలిగి ఉంటుంది. బంగారం నిల్వ కూడా ఈ ప్రక్రియలో ఒక భాగమే. ఆర్థిక, సాంఘిక రక్షణకు బంగారం కలిగి ఉండాలనే తప్పుడు భద్రతా భావనను, సమాజంలోని అన్ని వర్గాలకు తెలివిగా నూరిపోయడం జరిగింది. దఫాల వారీగా వివిధ ప్రభుత్వాలు, బంగారు కొనుగోళ్ళపై విధించిన ఆంక్షలు చిత్తశుద్ధితో చేసినవికావు. ఈ తరహా ఆంక్షలు పాలకవర్గ నిజ స్వరూపాన్ని కప్పి ఉంచడానికి వినియోగించినవే!

పాలకవర్గం 'పెట్టుబడి'పై తమ నిరంతర అదుపును, దాన్ని వినియోగాన్ని తమ చేజారిపోకుండా జాగ్రత్తపడుతుంది. దీనిలో భాగంగానే అది సామాన్య ప్రజానీకంలో 'బంగారాన్ని' సాంఘిక, మతకార్యక్రమాల్లో తప్పనిసరి వస్తువుగా, ఆర్థిక, సాంఘిక రంగాల్లో ఉన్నత గౌరవంతో బాటు, కష్టకాలంలో ఆదుకునే వస్తువుగా అన్ని కాలాల్లోను ప్రచారం చేసింది. దేవుళ్ళకు, దేవాలయాలకు అలంకరణ వస్తువుగా మార్చింది.

నేటి లోకవిద్యాధర సమాజం ముందు ఒక ప్రశ్న ఉంది. అదనపు విలువ రూపంగా ఉన్న 'మిగులు'ను తిరిగి పెట్టుబడిగా మార్చడమా? లేదా దాన్ని బంగారు రూపంలో దాచుకోవడమా? ఉత్పత్తి ప్రక్రియలో శ్రమ విలువతో పాటు 'పెట్టుబడి' అనేది అత్యావశ్యం. పెట్టుబడిలేకుండా వస్తూత్పత్తి జరుగదు. ఈ వాస్తవాన్ని ఈ రోజు లోకవిద్యాధర సమాజంలో మనం ప్రత్యక్షంగా గమనిస్తున్నాము. రైతులు తమ పంట పొలాలకు విత్తనాలు, ఎరువులు, మార్కెటింగ్, చేతి వృత్తుల వారు ముడి సరుకు కొనుగోలుకు తమ వృత్తి పనిముట్ల ఆధునీకరణకు, ఉత్పత్తిని మార్కెట్లో అమ్ముకోవడానికి, అలాగే గిరిజనులు వస్తు సేకరణకు, మార్కెట్‌కు సరుకు చేరవేయడానికి పెట్టుబడి అత్యావశ్యం. అయితే నేడు లోకవిద్యాధర సమాజం పెట్టుబడి నిరాకరించబడి, విధిలేని పరిస్థితులలో అప్పుల ఊబిలోకి నెట్టబడి, బయటపడే మార్గంలేక ఆత్మహత్యలకు ఒడిగడుతున్నారు.

తమ సర్వశక్తులు ఒడ్డి, అనువంశిక వృత్తి నైపుణ్యాన్ని తాము తయారు చేసిన వస్తువుల్లో నింపిన లోకవిద్యాధరుల కళాత్మక సృష్టిని, 'మార్కెట్ విలువ' లనే రంగు కళ్ళద్దాలు చూడలేకపోతున్నాయి. క్రమేపి కుచించుకపోతున్న స్థానిక మార్కెట్లు వారి వృత్తులనే ప్రశ్నార్థకంగా మార్చివేస్తున్నాయి. దీనికి తోడు లోక విద్యాధర సమాజం, తమ ఆర్థిక, సాంఘిక భద్రతకు రక్షణగా తమ అధీనంలో ఉన్న 'పెట్టుబడి'ని 'బంగారం'పై మదుపు పెట్టాలనే కాలం చెల్లిన ఆలోచనతోనే ఉన్నారు. ఛాందస మతసాంఘిక భావాల ప్రభావంలో నుండి యింకా బయట పడాల్సిన అవసరం వుంది. లోకవిద్యాధర సమాజం నుండి తమ అంత:చలనశీల శక్తులు దోచబడి, తమ స్వార్జితమైన పెట్టుబడిని 'ఉత్పత్తి' ప్రక్రియలో వాడాలనే ప్రాథమిక పెట్టుబడిదారి ఆర్థిక సూత్రాన్ని విస్మరించి, (పెట్టుబడికి అప్పుచేయడం అలవాటుపడి) ఉత్పత్తులకు మార్కెట్ లేక, అప్పుల ఊబిలో కూరుకొనిపోతున్నారు. నయా మార్కెట్‌కు బానిసలుగా మారుతున్నారు.

'పెట్టుబడి' కింద వినియోగించాల్సిన డబ్బును బంగారంలో నిల్వచేయక, తిరిగి క్రియాశీలక ఉత్పత్తిలో మదుపు పెట్టడం నేటి లోకవిద్యాధర సమాజం తక్షణ కర్తవ్యం. దీనితోపాటు వారి ఉత్పత్తులను, విచక్షణా రహితంగా వస్తు కొనుగోళ్ళు జరిగే పెద్ద మార్కెట్‌లకు బదులు, ప్రాంతీయ మార్కెట్ (సంత)లను పునరుద్ధరించి స్థానిక మార్కెట్ల అభివృద్ధికి ప్రతిఒక్కరూ కృషిచేయాల్సి వుంది. స్థానిక ఉత్పత్తుల వాడకాన్ని ప్రోత్సహించి బహుళజాతి సంస్థల ఉత్పత్తులను బహిష్కరించే వైపు తద్వారా లోకవిద్యాధరులైన, వృత్తిదారులు, రైతులు, చిన్న దుకాణాదారులు, మహిళలు ఉపాధి సౌకర్యాలు మెరుగుపడతాయి. ప్రభుత్వం అనుసరించే ప్రస్తుత విధానం పెద్ద పెద్ద మాల్స్ వంటివి విదేశీ ఉత్పత్తుల అభివృద్ధికి దోహదం చేసి చిన్న ఉత్పత్తిదారులు ఉపాధి అవకాశాలు కోల్పోయే విధంగా వుంది.

ఈ దిశగా వారికి తగిన అండదండలు, ప్రోత్సాహం అందించాల్సిన బాధ్యత మనందరిది.

**- ప్రొ॥ బి. కృష్ణరాజులు**

**మా సంస్థ గురించి మరియు పాత పత్రికల గురించి చూడవల్సిన**
**వెబ్ పేజీ** : Loka Vidya blogspot vidyaashram
**http : // www.vidyaashram.org/lokavidya_prapancham.html.**
**http : // vidyaashram.org/papers/LJA-Announcement_Telugu.pdf**

వ్యాసాలు, ఉద్యమ వార్తలు పంపించవలసిన చిరునామా :

**Loka Vidya Prapancham**
**D.No. 10-100, New Gaddiannaram, Behind Shivaganga Theaters,**
**Saroornagar (M), R.R. Dist. A.P.- 500 060 Ph : 040-24152155**
**e-mail : tnrkoundinyasa@yahoo.com**

**BOOK - POST PRINTED MATTER**
**AUGUST - 2013**

To

Printed, Edited & Published by T. Narayana Rao B.Com., LL.B. D.No. 10-100, New Gaddiannaram, Behind Shivaganga Theaters, Saroornagar (M), R.R. Dist. A.P.- 60
Printed at : M/s Print Point, H.No. 5-14, Opp. Megha Theatre lane, Durganagar, Dilsukhnagar, R.R. Dist. A.P.-500 060.